క్లుప్తంగా

నిల్వనీటితో రోగాలు

పెంబి: నిల్వనీటితో రోగాల ముప్పు పొంచి ఉంటుందని ఎంపీడీవో సు ధాకర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు షెట్‌పల్లి, లోతర్యతండా గ్రామాల్లో పర్యటించారు. వ్యాధులు ప్రబలకుండా ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. అనంతరం కడెం వాగును, లోతర్యతండా వద్ద కోతకు గురైన రోడ్డు పరిశీలించారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఫోన్లు అప్పగింత

నిర్మల్‌రూరల్: మండలంలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న ముగ్గురికి బుధవారం అప్పగించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని మంజులాపూర్‌కు చెందిన ఉల్లెంగ సాయికుమార్, వెంగ్వాపేట్‌కు చెందిన ఉడత గంగకిషన్, ముజ్గి గ్రామానికి చెందిన అవియాత్ మహేశ్ 15 రోజుల కిందట ఫోన్లు పొగొట్టుకున్నారు. బాధితులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ టెక్నాలజీ సాయంతో ట్రేస్ చేసి ఫోన్లను స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించినట్లు ఎస్సై వివరించారు.

మంత్రికి రాఖీ కట్టిన జెడ్పీటీసీ



కిషన్‌రెడ్డికి రాఖీ కడుతున్న జానుబాయి

ఖానాపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బుధవారం పెంబి జెడ్పీటీసీ జానుబాయి రాఖీ కట్టారు. హైదరాబాద్ కాచిగూడలోని వారి నివాసంలో కిషన్‌రెడ్డిని కలిసి రాఖీ కట్టారు. అనంతరం నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, ప్రజల సమస్యలపై చర్చించారు.

పొరపాట్లు సరిదిద్దాలని ఫిర్యాదు

ఖానాపూర్: వీఆర్‌ఏలను సర్దుబాటు చేయడంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్(సీసీఎల్ఏ)లో పలువురు వీఆర్ఏలు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆర్.జనార్దన్, అరుణ, సునారికారి రాజేశ్, విలాస్, లింగన్న, భోజన్న, పోశెట్టి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు కిట్‌లు పంపిణీ

లోకేశ్వరం: తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బీఎల్‌వోలకు ఎన్నికల ఓటరు నమోదు కిట్లను బుధవారం తహసీల్దార్ మోతీరాం అందజేశారు. ఓటరు నమోదు కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలన్నారు. వారి వెంట ఆర్ ఐ బాలకిషన్, సిబ్బంది నరేశ్, సాయి, బీఎల్‌వోలు ఉన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దు

కడెం: కుల, మత, వ్యక్తిగత రాజకీయపరమైన అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, సోషల్ మీడియాలో పోస్టులు చేస్తే చట్టరీత్య చర్యలు తప్పవని ఎస్సై కొసన రాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్లెక్సీలు, బ్యానర్లు ధ్వంసం చేయడం, అనుమతి లేకుండా డీజేలు, ర్యాలీలు నిర్వహించొద్దని సూచించారు.

ఖానాపూర్: సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు చేస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆర్. శంకర్ హెచ్చరించారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాజకీయ పార్టీల గురించి అసత్య, వ్యతిరేఖ, అసభ్యకరమైన పోస్టులు పెట్టవద్దన్నారు. వ్యక్తిగత దూషణలు, నిరాధరమైన ఆరోపణలు చేయవద్దని సూచించారు.

ఫ్యాక్టరీ నిర్మాణం ఆపేయాలి

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లి, దిలావర్‌పూర్ గ్రామాల నడుమ నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని వెంటనే నిలిపేయాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఫ్యాక్టరీ నిర్మించే స్థలాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రమాదక కర వాయువులను విడుదల చేసే ఫ్యాక్టరీ నిర్మాణానికి భూములను బీజేపీ నాయకులు సమకూర్చగా బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతులిచ్చి రైతులకు అన్యాయం చేశాయని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్మాణం ఆపకుంటే రైతుల తరపున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. తక్కల సాగర్‌రెడ్డి, అర్శుల రమణ, తదితరులు పాల్గొన్నారు.

పాత ట్రాక్టర్ విక్రయించారని షోరూం వద్ద ఆందోళన

కడెం: పాడైన ట్రాక్టర్‌ను కొత్తదని విక్రయించి తనను మోసం చేశారని మండలంలోని మొర్రిగూడెంకు చెందిన బంగారి నవీన్ బుధవారం షోరూం వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు. మండలంలోని కన్నాపూర్ సమీపంలోని ఓ ట్రాక్టర్ షోరూంలో జూన్‌లో కొత్త ట్రాక్టర్ కొనుగోలు చేశానని పేర్కొన్నాడు. వాహనం తరచుగా రిపేర్ కావడం, డీజిల్ అవరేజ్ రాకపోవడం వంటి సమస్యలు ఎదురయ్యాయయని పేర్కొన్నారు. షోరూం సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదని వాపోయాడు. తనకు కొత్త ట్రాక్టర్ ఇవ్వాలని గ్రామస్తులతో కలిసి ఆందోళన నిర్వహించారు. యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని షోరూం సిబ్బంది తెలిపారు.

ప్రారంభానికి ముందే పగుళ్లు

- నాసిరకంగా న్యూలోలం–దిలావర్‌పూర్ తండా బీటీ రోడ్డు పనులు
- కల్వర్టు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టని కాంట్రాక్టర్
- అధికారులు మరమ్మతులు చేయించాలని తండావాసుల వేడుకోలు



కల్వర్టు వద్ద ప్రారంభం కాని సీసీ పనులు



ప్రారంభానికి ముందే పగుళ్లు తేలిన న్యూలోలం–దిలావర్‌పూర్‌తండా రోడ్డు

దిలావర్‌పూర్: మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలతో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తోంది. అధికారుల పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేపట్టడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇందుకు నిదర్శనమే ఐదు నెలల కిందట న్యూలోలం–దిలావర్‌పూర్‌తండా వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులు.

మూడు కిలోమీటర్ల మేర రోడ్డు..

నిర్మల్–భైంసా రహదారిని ఆనుకొని ఉన్న న్యూలోలం గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో దిలావర్‌పూర్ తండా ఉంటుంది. దిలావర్‌తండా నుంచి దిలావర్‌పూర్ వరకు మరో రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. 50 ఏళ్ల కిందట ఏర్పడిన దిలావర్‌పూర్‌తండాకు వెళ్లాలంటే దిలావర్‌పూర్ నుంచి న్యూలోలం గ్రామం మీదుగా ఉన్న మట్టి రోడ్డే దిక్కు.

రూ.2.85 కోట్లు మంజూరు..

ప్రభుత్వం తండావాసుల కష్టాలను తీర్చేందుకు న్యూలోలం–దిలావర్‌పూర్‌తండా వరకు మూడు కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించేందుకు గిరిజన సంక్షేమశాఖ సహకారంతో రూ.2.85 కోట్ల నిధులు మంజూరు చేసింది. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్‌తో కలిసి మార్చి నెలలో పనులు ప్రారంభించారు.

నాణ్యతకు తిలోదకాలు..

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇష్టానుసారం వ్యవహరించాడు. ఆగమేఘాల మీద పనులు చేపట్టడంతో నాణ్యత లోపించిందని తండావాసులు పేర్కొంటున్నారు. భారీ వర్షాలకు తోడు కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు వెళ్లడంతో పలు చోట్ల రోడ్డు దెబ్బతింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

మూడు కిలోమీటర్ల మేర నిర్మించిన ఈ రోడ్డు మార్గంలో తండా సమీపంలో కల్వర్టు వద్ద సీసీ నిర్మాణం, తండాలో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టలేదని తండావాసులు అంటున్నారు. నిధులున్నా.. కావాలనే కాంట్రాక్టర్ జాప్యం చేస్తున్నాడని ఆరోపిస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుకు సంబంధించిన నిర్మాణాలను పూర్తి చేయాలని తండావాసులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



న్యూలోలం గ్రామం నుంచి దిలావర్‌పూర్ తండా వరకు రోడ్డు పనులు పూర్తయిన ఐదు నెలలకే కంకర తేలింది. అంచుల వద్ద మొరం కొట్టుకుపోవడంతో ద్విచక్రవాహనదారులు కింద పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. – చవాన్‌ప్రేమ్, దిలావర్‌పూర్‌తండా

సీసీ పనులు చేపట్టాలి



దిలావర్‌పూర్ నుంచి తండా మీదుగా న్యూలోలం శివార్లలోని పంట చేన్లకు వెళ్తుంటాం. న్యూలోలం మీదుగానే ఇతర ప్రాంతాలకు ప్రయాణం సాగిస్తుంటాం. వర్షం కురిస్తే కల్వర్టు వద్ద గుంతలు, బురద ఏర్పడుతోంది. కల్వర్టు వద్ద సీసీ పనులు చేపట్టాలి. – బొద్దు ప్రవీణ్, దిలావర్‌పూర్

పనులు చేయిస్తాం

న్యూలోలం గ్రామం నుంచి దిలావర్‌పూర్‌తండా వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులు 70 శాతం పూర్తయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు వరినాట్ల సమయంలో కేజీవీల్స్‌తో ట్రాక్టర్ వెళ్లడంతో రోడ్డు పలు చోట్ల దెబ్బతింది. కాంట్రాక్టర్‌తో మాట్లాడి దెబ్బతిన్న చోట మరమ్మతులు చేసేలా చూస్తాం. నాణ్యత విషయంలో రాజీ పడం. – ప్రదీప్ రాథోడ్, ఏఈ, ఐటీడీఏ

అభివృద్ధి చేస్తా.. మళ్లీ గెలిపించండి

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

లోకేశ్వరం: ప్రజలకు అందుబాటులో ఉండి మరింత అభివృద్ధి చేస్తానని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బాగాపూర్‌లో రూ.2.50 లక్షలతో లక్ష్మీ నారాయణస్వామి ఆలయ ఆవరణలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ, సాత్‌గాంలో రూ.42 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు త్వరలో మరమ్మతులు చేయిస్తామని పేర్కొన్నారు. సాత్గాం, హత్‌గాం గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీకి చెందిన 50 మంది బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, సర్పంచ్‌లు శేఖర్‌రెడ్డి, భుజంగ్‌రావు, లక్ష్మీ, ముత్తగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, మండల పార్టీ కన్వీనర్ శ్యాంసుందర్, నాయకులు భోజన్న, కపిల్, సుదర్శన్‌రెడ్డి, సుధీర్ రెడ్డి, ప్రశాంత్, భోజారెడ్డి, ముత్తన్న ఉన్నారు.



భాగాపూర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

బడుగుల అభ్యున్నతికి కృషి..

లోకేశ్వరం: బడుగు, బలహీన వర్గాలకు అన్నాభావు సాఠే చేసిన కృషి మరువలేనిదని ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ధర్మోర గ్రామంలో సాఠే విగ్రహం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, సర్పంచ్ శారద, సాహేందర్, మంద భాస్కర్, అనిల్, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్, భూమన్న, సాయన్న, రాకేశ్, భోజన్న, శ్రీకాంత్, కపిల్, సాయన్న పాల్గొన్నారు.

భైంసా: ముధోల్ మండలంలోని వితోలిలో సాఠే విగ్రహానికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ సత్యగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, వంశీకృష్ణ, నాగేష్‌పటేల్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



కుభీర్‌లో మాట్లాడుతున్న హన్మాండ్లు



తానూరు: బెల్‌తరోడా ప్రాథమిక పాఠశాలలో మొక్కలకు రాఖీలు కడుతున్న విద్యార్థులు

కుభీర్: జిల్లావ్యాప్తంగా రక్షాబంధన్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పి.లక్ష్మన్, పిరాజీ. అభిషేక్, రాజన్న తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని ఓలాలో సర్పంచ్ కనీస్ ఫాతిమా పంచాయతీ కార్యదర్శి యోగేష్, కారోబారి శంకర్, బీపీఎం నరేశ్‌కు రాఖీ కట్టి మతసామరస్యం చాటుకున్నారు. మండలంలోని కల్లూర్ వాసవి కళాశాలలో విద్యార్థులు రక్షాబంధన్ ఆకృతిలో కూర్చుని ప్రదర్శన నిర్వహించారు. కరస్పాండెంట్ జానకీరాం, ప్రిన్సిపాల్లు శ్రీనివాస్, సాయిలు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని బెల్‌తరోడా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు మొక్కలకు రాఖీలు కట్టారు. నేను నీకు.. నువ్వు నాకు రక్ష అని నినాదాలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి):మండల కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రాఖీ పండుగ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కిషన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడెం: మండల కేంద్రంలోని కేజీబీవీలో రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు పేపర్‌తో తయారు చేసిన రాఖీలు ఆకట్టుకున్నాయి.

సారంగపూర్: మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో రక్షాబంధన్ నిర్వహించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు వేడుకలో పాల్గొన్నారు.


భైంసాటౌన్:పట్టణంలోని పలు పాఠశాలల్లో రాఖీ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక వాసవి ఉన్నత పాఠశాలలో వేడుకలు నిర్వహించారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రమేశ్, భోజన్న, పోశెట్టి ఉన్నారు.

నిర్మల్ పోలీస్‌స్టేషన్‌లో..

నిర్మల్‌టౌన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి ఏబీవీపీ నిర్మల్‌శాఖ ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులకు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ పురుషోత్తం, జిల్లా కన్వీనర్ శశి, దినేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద/సోన్: మండలవ్యాప్తంగా రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోన్ మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస మూర్తి రాఖీ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.



భైంసా వాసవి పాఠశాలలో..



నిర్మల్‌లోని బచ్‌పన్ పాఠశాలలో

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. బంగల్‌పేట్ ప్రాథమిక పాఠశాల, విజయ హైస్కూల్, బచపన్ పాఠశాలల్లో విద్యార్థులు ఒకరికొకరు రాఖీ కట్టుకున్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆపదలో 100కు డయల్ చేయాలి

నిర్మల్‌టౌన్: ఆపద ఎదురైతే ఆందోళన చెందకుండా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని షీటీం ఎస్సై సుమాంజలి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కస్తూర్బా మైనార్టీ పాఠశాలలో విద్యార్థినులకు షీటీం బృందం ఆధ్వర్యంలో సీసీ కెమెరాలతో కలిగే లాభాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, టోల్ ఫ్రీ నెంబర్ 1930 వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో షీ టీం నెంబర్ 87126 59550కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, షీటీం సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులతో షీ టీం సిబ్బంది

విగ్రహావిష్కరణ వేడుకలు

సారంగపూర్: మండలంలోని ప్యారమూర్ దత్తాశ్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, స్వామీ అవదూతానంద సరస్వతీ మహారాజ్ విగ్రహావిష్కరణ వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విగ్రహానికి క్షీరాభిషేకం, మంత్రోచ్ఛరణల నడుమ హోమం నిర్వహించారు. గురువారం విగ్రహావిష్కరణ నిర్వహిస్తామని కమిటీ సభ్యులు లింగారెడ్డి, శేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నాగభూషణ్ తదితరులు తెలిపారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం కార్యవర్గం ఎన్నిక

కడెం: మండలంలోని కడెం–పెద్దూర్ వడ్డెర సంఘం కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా పసుపుల మనోహర్, ఉపాధ్యక్షుడిగా బాసగుట్ట వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా వెంకటస్వామి, సంయుక్త కార్యదర్శిగా రాజు, ప్రచార కార్యదర్శులుగా గంగాధర్, ఆనంద్‌ను ఎన్నుకున్నారు.

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

భైంసాటౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని భైంసా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి దేవేంద్రబాబు అన్నారు. ఈ మేరకు బుధవారం డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజీతో పరిష్కారమయ్యే కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.



భైంసాలో మాట్లాడుతున్న జడ్జి దేవేంద్రబాబు

కేసులు పరిష్కరించుకోవాలి

ఖానాపూర్: ఇన్సూరెన్స్ రికవరీ కేసులను లీగల్ సర్వీసెస్ మండల కమిటీతో సంప్రదించి పరిష్కరించుకోవాలని ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని కోర్టులో ఇన్సూరెన్స్ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో బ్యాంకుల మేనేజర్లు, ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఖానాపూర్: నిర్మల్ సభలో ఇచ్చిన హామీ మేరకు సీఎం కేసీఆర్ ఖానాపూర్ మున్సిపాలిటీకి రూ.25 కోట్లు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రటానికి క్షీరాభిషేకం చేశారు. చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ ఖలీల్, మాజీ ఉపసర్పంచ్ సుమన్, కోఆప్షన్ అంజాద్‌ఖాన్, నాయకులు పానగంటి రాజేందర్, కమిషనర్ మనోహర్ పాల్గొన్నారు. అంతకముందు జగన్నాథ్‌రావు చౌరస్తాలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పరిమి సురేశ్, కౌన్సిలర్లు, నాయకులు కావలి సంతోశ్, తొంటి శ్రీనివాస్, జన్నారపు శంకర్, కేహెచ్ ఖాన్, వెంకటప్పయ్య క్షీరాభిషేకం చేశారు.



నిర్మల్‌లో క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

నిర్మల్‌టౌన్: అర్చకులకు దూప, దీప నైవేద్య పథకం కింద గౌరవ వేతనం పెంచినందుకు జిల్లా కేంద్రంలోని దేవరకోట దేవస్థానం ప్రాంగణంలో బుధవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో దేవరకోట ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, అడెల్లి ఆలయ చైర్మన్ చందు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, పూదరి శివ, ఆకుల రామకృష్ణ, అర్చకులు, ఆలయ డైరెక్టర్లు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల క్షీరాభిషేకం

ఖానాపూర్: వంటగ్యాస్ సిలిండర్ల ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించడాన్ని హర్షిస్తూ.. పట్టణంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కీర్తి మనోజ్, సందుపట్ల శ్రావణ్, నాయిని సంతోశ్, సాయి, ప్రశాంత్, బుచ్చన్న, ఆనంద్, చిరంజీవి, శేఖర్, వెంకటేశ్, అనిల్ తదితరులున్నారు.



ఖానాపూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పేద, మధ్య తరగతి కుటుంబాలకు మేలు జరిగేలా గ్యాస్ సిలిండర్ ధర రూ 200, సబ్సిడీ సిలిండర్ రూ.400 తగ్గించినందుకు బుధవారం నిర్మల్‌లో బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు సాదం అరవింద్ , ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు అలివేలు మంగ, జిల్లా కార్యదర్శి గడె విలాస్, ముత్యంరెడ్డి, అల్లం భాస్కర్, నరేశ్, రాజు, అజయ్, శ్రవణ్, విజయ్, రమేశ్, వెంకట్ పాల్గొన్నారు.

ఎత్తుకెళ్లిన బ్యాగ్ బాధితురాలికి అప్పగింత

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఓ షాపింగ్‌మాల్‌లో బుధవారం ఓ మహిళ నుంచి బ్యాగ్ ఎత్తుకెళ్లిన మరో మహిళను వెంబండించి బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. లోకేశ్వరం మండలం పిప్రి గ్రామానికి చెందిన గోదావరి నిర్మల్‌లోని ఓ దుస్తుల దుకాణానికి వెళ్లింది. గోదావరి తన బ్యాగును పక్కకు పెట్టడంతో మరో మహిళ దానిని దొంగలించి పారిపోతుండగా ట్రాఫిక్ కానిస్టేబుల్ రవి గమనించాడు. ఆమెను వెంబడించగా బ్యాగ్ ఆటోలో పడేసి పారిపోయింది. అనంతరం బ్యాగ్‌ను గోదావరికి అప్పగించారు. బ్యాగులో రూ.10 వేల విలువైన స్మార్ట్‌ఫోన్ ఉన్నట్లు బాధితురాలు తెలిపింది. ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

సంక్షిప్త వార్తలు

నేడు ప్రత్యేక సమావేశం

సోన్: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ మానసరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2023–24 సంవత్సరానికి సంక్షేమ అభివృద్ధి నిధి కింద మండలానికి రూ.20లక్షలు మంజూరయ్యాయి. మండల ప్రాదేశిక నియోజక సభ్యులు,కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

రేపు బహిరంగ వేలం

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించే వివిధ దుకాణాలకు శుక్రవారం బహిరంగ వేలం పాట చేపట్టనున్నట్లు ఆలయ ఈఓ రంగు రవికిషన్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇదివరకు వాయిదా పడిన కొబ్బరికాయలు విక్రయించుకునే హక్కు, టెంట్ హౌజ్ సామాన్లు అద్దెకిచ్చే హక్కు, ఇడుపుడు పిల్లలు సేకరించే హక్కు, తైబజార్ వసూలు చేసుకునే హక్కులకు వేలం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనే వ్యాపారులు గంట ముందు అధికారులు నిర్ణయించిన ధరావత్తు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

కార్యదర్శులతో సమీక్ష

తానూరు: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు తయారు చేసి ఇవ్వాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ప్రతి పంచాయతీకి రూ.10 లక్షల చొప్పున మంజూరయ్యాయని పేర్కొన్నారు. ప్రణాళికలను గురువారం ఎంపీడీవో కార్యాలయంలో అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మోహన్‌సింగ్, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

సమ్మె నోటీసు అందజేత

నిర్మల్‌చైన్‌గేట్: ఐసీడీఎస్‌లో పని చేసే అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ప్రాజెక్ట్ డైరెక్టర్, కలెక్టర్ వరుణ్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల 11 నుంచి పూర్తిగా సమ్మెలోకి వెళ్తామన్నారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజమణి, ప్రధాన కార్యదర్శి లలిత, శైలజ, శశికళ, గంగామణి, భాగ్య, విజయ, సునీత పాల్గొన్నారు.

సోయా పంటల పరిశీలన

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో సోయా పంటలను ఏఈఓ లక్ష్మి పరిశీలించారు. బుధవారం పంట భూముల వద్ద రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పంటను ఆశించే చీడపీడల నివారణకు పలు సూచనలు చేశారు.

భైంసాటౌన్: కుంటాల మండలంలో సోయా పంటకు కాండపు ఈగ సోకిందని.. దీంతో పంట ఎండిపోయే ప్రమాదం ఉందని భైంసా మండల వ్యవసాయాధికారి రామచందర్ నాయక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు భైంసా మండల రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఆదర్శ రైతులను కొనసాగించాలి

ఖానాపూర్: ప్రభుత్వానికి.. రైతులకు మధ్య వారధిలా పని చేసే ఆదర్శ రైతులను తిరిగి కొనసాగించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ మండలానికి చెందిన ఆదర్శ రైతులు బుధవారం ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్‌ను పట్టణంలోని వారి నివాసంలో కలిసి విన్నవించారు. తుర్క మోహన్‌రెడ్డి, మగ్గిడి సురేశ్, కొంపెల్లి రాజన్న, రాంభీమన్న, గొడిసెరాల రాజన్న, శంకర్, రమేశ్, పుప్పాల రవి, దామెర శ్రీనివాస్, రాజు, నర్సయ్య, గంగాధర్ తదితరులున్నారు.

విద్యార్థులకు బ్యాగులు అందజేత

భైంసాటౌన్: పట్టణంలోని ఏపీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం పలువురు విద్యార్థులకు దివ్యాంగ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగులు, నీటి సీసాలు అందజేశారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో దివ్యాంగులైన విద్యార్థులకు ఎస్కార్ట్‌గా వ్యవహరించిన విద్యార్థులకు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పంచగుడి మహేష్ బ్యాగులు అందించారు. ఒకటో తరగతి విద్యార్థులకు సైతం వాటర్ బాటిళ్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్, శంకర్ ఉన్నారు.